ఇండియా స్కెలిటన్స్

ప్రతాప రవిశంకర్

ప్లీడరు విష్ణుమూర్తిగారింట్లో జనం శోకాలు పెట్టి యేడుస్తున్నారు. ఒకరు కాదు—ఇద్దరు కాదు—పదిమందికి పైగా అలా పెద్దగా ఏడుస్తుంటే రోడ్డుమీద పోయే మనుషులు కూడా లోపలకు వచ్చి శవాన్ని చూసి వెళుతున్నారు.

ఆ శవం యెవరిదో కాదు—ప్లీడరు విష్ణుమూర్తిదే—ఆయనకు ఇంకా యాభై ఏళ్ళు రాలేదు. ఇంకో రెండు రోజుల్లో యాభైయవ యేడు వచ్చేది. కాని మాయదారి గుండెపోటు తొందరపడి వచ్చి విష్ణుమూర్తి యాభైలో పడకముందే ఆ సాయంత్రం ఆరుగంటల సమయంలో అతడిని పైకి తీసుకుపోయింది.

ఇప్పుడు అతని భార్య-ఇద్దరు కూతుళ్ళు—ఒక కొడుకు ఇంకొంతమంది బంధువులు, ఆ శవంమీదపడి ఒకటే యేడుపు.

ఆ యేడుపు ఒక్క బజారుకే కాకుండా నాలుగైదు

వీధులవరకూ వినపడుతున్నది. అందులో విష్ణుమూర్తి పెద్ద కూతురు సుశీల గొంతు శావురు కప్పిగొంతులా వుంటుంది. బొంగురుగా ఎంత దూరానికో మైకులో అరిచినట్లు వినపడుతుంది. పైగా ఎక్కువసేపు ఏడవటంవల్ల గొంతు మరింత బొంగురుపోయి రీసవుండ్ ఇస్తోంది.

పక్కింట్లో వుంటున్న లెక్చరర్ రంగారావు—విష్ణుమూర్తి ముఖ్యమైన బంధువుల ఎడ్రసులు తీసుకుని వాళ్ళందరికీ టెలిగ్రాములు ఇవ్వటానికి అరగంట క్రితమే సైకిలు మీద వెళ్ళాడు.

విష్ణుమూర్తి పెద్దకొడుకు ఆదిలాబాదులో ఓ ప్రభుత్వ ఆఫీసులో పనిచేస్తున్నాడు. అతనికి కూడా టెలిగ్రాం ఇచ్చాడు రంగారావు.

రెండో కొడుకు జనార్దనానికి ఇంకా పెళ్ళికాలేదు. రెండో కూతురు శకుంతలకు కూడా పెళ్ళి కాలేదు. ప్రస్తుతం వాళ్ళందరూ ఇంట్లోనే వున్నారు.

అసలు విష్ణుమూర్తికి గుండెపోటు వస్తుందనీ—ఇలా అర్థంతరంగా టపాకడతాడనీ యెవ్వరూ అనుకోలేకపోయారు. ఆయనకు ఆ వూళ్లో చెట్టుకింద ప్లీడరుగా మంచి పేరు వుంది.

అందుకే ప్లీడరు విష్ణుమూర్తి చావు వార్త అరగంటలోనే ఆరు మైళ్ళవరకు వ్యాపించింది. అతనిలాటి చెట్టుకింద ప్లీడరు—చెట్టుమీద ప్లీడర్లు అంతా వరుసగా రావటం మొదలుపెట్టారు.

బాగా చీకటి పడిపోయింది. యెవరో లైటు స్విచ్ నొక్కారు. దీపం వెలిగింది.

వరండాలో పడుకోబెట్టారు విష్ణుమూర్తి శవాన్ని.

ప్రశాంతంగా వున్నది అతని మొహం.

జనం వస్తున్నారు. శవాన్ని చూసి వెళుతున్నారు. చూస్తుండగానే బాగా చీకటిపడిపోయింది.

ఎనిమిది—తొమ్మిది .... పది .... పదకొండు గంటలు దాటింది.

ఏడ్చి అలసిపోయిన వాళ్ళు మవునంగా మనసులోనే దైవప్రార్థన చేస్తున్నట్టు రోదించటం మొదలుపెట్టారు. రావలసిన ముఖ్య బంధువులు ఇంకా రాలేదు.

ఉన్నట్టుండి మేఘాలు కమ్ముకొచ్చాయి. చలిగాలి విసురుగా కొట్టింది. పదినిముషాల తర్వాత వర్షం మొదలయింది. క్షణాలమీద అది ఉధృతంగా మారిపోయింది.

జల్లు పడుతోందని వరండాలో శవానికి దగ్గరగా కూర్చున్న మనుషులు కొంచెం లోపలకు జరిగారు.

విష్ణుమూర్తి మీద కూడా జల్లు పడుతోన్నది. అయినా అతను చనిపోయాడు కాబట్టి బాధలేదు.

ఎక్కడో పిడుగు పడింది. ఆ తర్వాత రెండు నిమిషాలకు ఉన్నట్టుండి కరెంటు పోయింది.

అంతా చీకటి. గాఢాంధకారం.

"దీపం వెలిగించండి" యెవరో ఒకామె అన్నది.

"వెధవ కరెంటు ఇప్పుడే పోవాలా?" అన్నది విష్ణుమూర్తి రెండో కూతురు.

"అగ్గిపెట్టె యెక్కడ వుంది?" యెవరో అడిగారు.

పదినిముషాలు గడిచాయి.

దీపం వెలిగించబోతున్నప్పుడు కరెంటు వచ్చింది.

దీపాలు వెలిగాయి.

ఒక్కసారి అంతా షాక్ కొట్టినట్టు ఐపోయారు. ప్లీడరు విష్ణుమూర్తి శవం అక్కడ లేదు. అక్కడంతా

ఖాళీగా వున్నది.

అందరూ భయంతో ఒకరి మొహాలొకరు చూసు కున్నారు.

అంతే! ఒక్కసారి కోరస్ లా అంతా పెద్దగా కేకాలు మొదలు పెట్టారు.

2

జనార్దనం— అతని అన్నయ్య ప్రకాశం పోలీసుస్టేషన్ లోకి అడుగుపెట్టారు. తెల్లవారు జామున నాలుగు గంట లకు అదిలాబాదునించి వచ్చాడు ప్లీడరు విష్ణుమూర్తి పెద్దకొడుకు ప్రకాశం.

లోపల ఇన్‌స్పెక్టర్ యేదో ఫైలు చూసుకుంటు న్నారు. ఇద్దరు కానిస్టేబుళ్ళు ఆ పక్కగా నిలబడి వున్నారు.

వీళ్ళిద్దరు వెళ్ళగానే "ఎవరు మీరు? యెందుకోసం వచ్చారు?" అనడిగారు కానిస్టేబుళ్ళు.

అప్పుడే ఇన్‌స్పెక్టర్ సూర్యం తలెత్తి ఆ అన్న దమ్ములను చూశాడు.

సోదరులిద్దరూ ఇన్‌స్పెక్టర్ కి నమస్కారంచేసి వాళ్ళ పేర్లు చెప్పి మేమిద్దరం ప్లీడరు విష్ణుమూర్తిగారి కొడు కులం. రాత్రి చనిపోయిన మా నాన్నగారి శవం కరెంటు పోయినప్పుడు మాయమైపోయింది. ఆ విషయమై మీకు రిపోర్టు ఇవ్వటానికి వచ్చాము" అన్నారు.

"ఏమిటీ....శవం మాయం కావటమా?!" అని జంటగా ఆశ్చర్యపోయారు రక్షకభటులు.

ఇన్‌స్పెక్టర్ సూర్యం వాళ్ళని కూర్చోమని "అంతా వివరంగా చెప్పండి....ప్లీడరు విష్ణుమూర్తిగారు మా అంద రికీ బాగానే తెలుసు. కోర్టులో కలుసుకుంటుంటాము.

అసలు ఆయన చనిపోవటమే నాకు ఆశ్చర్యంగా వున్నది. పైగా శవం కూడా మాయం కావటమా?!" అన్నాడు.

కుర్చీల్లో సర్దుకుని కూర్చున్నాక తర్వాత జనార్దనం గొంతు సవరించుకుని వస్తున్న దుఃఖాన్ని బలవంతాన ఆపుకుంటూ — పదకొండు గంటలు దాటుతున్నప్పుడు వర్షం రావటం కరెంటు పోవటం—మళ్ళీ కరెంటు వచ్చినప్పుడు చూస్తే తండ్రి శవం కనిపించకపోవటం గురించి వివరంగా చెప్పాడు.

"ఇదెక్కడి వింత? యెక్కడో అమెరికాలో శవాలు మాయం కావటం గురించి యెప్పుడో విన్నాను కాని ఇండియాలో కూడా శవాలు మాయం అవుతున్నాయా!" అన్నాడు ఓ కాన్‌స్టేబుల్—అతడి పేరు చెన్నయ్య. మూడు నాలుగులు.

"శవం ఒంటిమీద యేమయినా నగలు వున్నాయా బాబూ" అనడిగాడు రెండో కాన్‌స్టేబులు. అతని పేరు శివయ్య. నెంబరు మూడు ఒకటి మూడు.

అతనలా అనగానే చెన్నయ్య పెద్దగా నవ్వి, "ప్లీడరు విష్ణుమూర్తిగారు లేడీ అనుకున్నావా? వంటిమీద నగలు వుండటానికి" అన్నాడు.

వెంటనే ఇన్‌స్పెక్టర్ కలగజేసుకుని "ఆపండి మీ సుత్తి....కొంచెంసేపు మాట్లాడకండి" అని ప్రకాశం కేసి చూసి "మీరు చెప్పినదంతా విన్నాను. అంతా అర్థమయ్యింది. అయితే నాకు కొన్ని అనుమానాలు వున్నాయి. వాటిని నేను తీర్చుకోవాలి" అన్నాడు.

"అడగండి సార్" అన్నాడు ప్రకాశం.

"మీ నాన్నగారికి బద్ధశత్రువులు యెవరయినా వున్నట్టు మీకు తెలుసా?"

"తెలీదండి .... ఆయన కోర్టులో కూడా గట్టిగా వాదించలేదండి .... అందుకే మా నాన్నకు పెద్దగా ప్రాక్టీసు కూడా లేదు. ఆయన్ని చాలామంది చెట్టుకింద ప్లీడరు అంటారు. మా నాన్న నలుగురితో స్నేహంగా వుండే మనిషి....అలాంటి వ్యక్తికి ఆయన శవాన్ని కూడా మాయంచేసి అంత్యక్రియలు జరగకుండా చూసేంతటి శత్రువులు వున్నారంటే నేను నమ్మను" అన్నాడు.

"నేను కూడా నమ్మను" అన్నాడు జనార్దనం.

"సరే ఇద్దరూ నమ్మవద్దు .... అయితే మీ ఇద్దరికీ శత్రువులు వున్నారా? ఒకవేళ మిమ్మల్ని ఏడిపించటానికి యెవరయినా ఈ పని చేశారేమో!" అన్నాడు యిన్స్పెక్టర్.

"లేరు సార్ ....ఆ తండ్రి కడుపున పుట్టిన మాకు శత్రువులు వుంటారా?" అన్నాడు ప్రకాశం.

"మరి ఎవరికి వున్నారయ్యా శత్రువులు—మీ నాన్న శవాన్ని మాయం చెయ్యటానికి" అన్నాడు చెన్నయ్య.

ఇన్స్పెక్టర్ అతడికేసి కోపంగా చూసేసరికి "సార్ ఇందులో ఏదో మిస్టరీ వుంది. మీరు కేసు రిజిస్టరు చేసుకోండి. ఈ మాయమైన శవం మిస్టరీ ఏమిటో మేము తేలుస్తాం" అన్నాడు చెన్నయ్య.

"అవును సార్ .... నేర పరిశోధనలో మా యిద్దరికీ వున్న అనుభవం యేమిటో మీకు తెలుసు. ఈ వ్యవహారాన్ని మా ఇద్దరికీ వదిలెయ్యండి" అన్నాడు శివయ్య.

సరేనన్నట్టు తలవూపాడు సూర్యం.

"ఏమిటీ.... ఈ మామూలు కాన్స్టేబుళ్ళు మా నాన్న శవం గురించి దర్యాప్తు చేస్తారా?" అనడిగాడు ప్రకాశం.

"ఏమిటి మీరనేది? మా ఇద్దరి సంగతి మీకు తెలిసి

నట్టులేదు. ఇదిగో ఈ చిన్న పుస్తకం చదవండి మీకే అర్థమవుతుంది" అని చెన్నయ్య నిక్కరు జేబులోనించి ఓ ఆరు పేజీల పుస్తకంతీసి ప్రకాశానికి ఇచ్చాడు.

"ఇదేమిటి?" అన్నాడు జనార్దనం.

"మేమిద్దరం కలిసి పరిశోధించిన కేసుల వివరాలు.... ఎంతమంది హంతకులను — దొంగలను—వ్యభిచారులను చట్టానికి పట్టిచ్చిందీ ఇందులో వివరంగా వుంది. వంద కేసులు పూర్తయిన సందర్భంగా ఓ వారం క్రితమే ఈ పుస్తకాన్ని అచ్చు వేయించాము" అన్నాడు శివయ్య.

ఆ పుస్తకాన్ని జేబులో పెట్టుకున్నాడు ప్రకాశం తర్వాత చదువుదామని.

"సరే....మీ ఎడ్రసు ఇచ్చి వెళ్ళండి. నేను ఈ విషయం గురించి దర్యాప్తుచేస్తాను. వీలయినంత త్వరలో మీ నాన్న శవాన్ని పట్టుకుని మీకు అప్పగిస్తాము" అన్నాడు ఇన్ స్పెక్టర్.

"థాంక్స్ సార్....ఎలాగయినా త్వరలో మీరు మా ఫాదర్ గారి శవాన్ని మాకు అందజెయ్యండి. లేకపోతే టెలిగ్రాములు అందుకుని మా ఇంటికి వచ్చే బంధువులకు మేము జవాబులు చెప్పలేక చావాలి" అన్నాడు జనార్దనం.

"అలాగే....నిర్భయంగా వెళ్ళిరండి...." అన్నాడు ఇన్ స్పెక్టర్.

సోదరులు నీరసంగా స్టేషన్ లోనించి బయటకు వచ్చారు. వాళ్ళు రోడ్డుమీదకు రాగానే కానిస్టేబుళ్ళిద్దరూ వాళ్ళ వెనుకే పరిగెత్తుకుంటూ వచ్చి "మీరు ఆ పుస్తకాన్ని తప్పక చదవండి. మా గురించి మీకు పూర్తిగా అర్థమవుతుంది" అన్నారు.

"సర్లే బాబూ....తప్పకుండా చదువుతాము. ముందు మా నాన్న శవం గురించి ఆచూకీ తియ్యండి" అన్నాడు ప్రకాశం.

"ఇప్పుడే మేము రంగంలోకి దిగుతున్నాము. మీరు దిగులు పడకండి. అన్నట్టు మీరు మా మామూలు యివ్వకుండా వెళ్ళిపోతున్నారేమిటి?" అన్నాడు శివయ్య.

"మామూలా! అసలే మేము మా నాన్న శవంపోయిన దుఃఖంలో వుంటే" అన్నాడు జనార్దనం.

"మామూళ్ళకి అలాంటి భేదాలుండవు .... త్వరగా ఇచ్చేయండి .... మేము దర్యాప్తు ప్రారంభించాలి" అన్నాడు చెన్నయ్య.

ఇక ఈ రక్షకభటులు వదిలేట్టుగా లేరని ప్రకాశం శేలులోనించి ఓ ఇరవై రూపాయలు తీసి వాళ్ళకి ఇచ్చి పంపించాడు.

3

కానిస్టేబుళ్ళు చెన్నయ్య—శివయ్యలు హుషారుగా ప్లీడరు విష్ణుమూర్తి శవం గురించిన దర్యాప్తుకు బయలుదేరారు.

"మన పరిశోధన ఎక్కడినించి మొదలు పెడదాం?" అని అడిగాడు శివయ్య.

"ఎక్కడినించేమిటి? మాయమైన శవాన్ని ఎవరయినా ఏం చేసుకుంటారు? ఏ సెంటర్లోనో పెట్టుకుని 'దిక్కులేని శవం బాబూ' అని అడుక్కుంటూ వుంటారు....ముందు మనం అల్లాంటి సెంటర్లలో వెతకాలి" అన్నాడు చెన్నయ్య.

"సరే పద" అన్నాడు శివయ్య బీడీ వెలిగించుకుని—

ఆ దర్యాప్తుదారు లిద్దరూ ముందుగా ఓ థియేటర్

సెంటర్ కి వెళ్ళారు. అక్కడ వాళ్ళకి శవాన్ని ముందు పెట్టుకుని అడుక్కుంటున్న మనుషులెక్వరూ కనిపించ లేదు.

వాళ్ళు అక్కడినించి మరో సెంటర్ కి వెళ్ళారు.

అక్కడ ఓ శవాన్ని ముందు పెట్టుకుని "దిక్కు లేనోడు బాబూ....ధరమం చేయండి బాబూ" అని ఇద్దరు మనుషులు పెద్దగా అరుస్తున్నారు.

ఆ శవానికి నిండుగా ముసుగు కప్పి వున్నది.... చుట్టూ పైసల బిళ్ళలు పడివున్నాయి.

"ఒరేయ్ .... ఈ శవం యెవరిదిరా?" అన్నాడు చెన్నయ్య.

"దిక్కు లేనోడిది బాబూ."

"వాడి పేరేమిటిరా?"

"పేరు తెలీదు బాబూ."

"ముందు శవంమీద ఆ గుడ్డను తీసెయ్యండి.... చూడాలి" అన్నాడు శివయ్య చేతిలో వున్న లాఠీ వూపుతూ—

ఒకడు శవంమీది గుడ్డను తీసేశాడు. యెవడో ముస లాడు. సన్నగా వున్నాడు.

"ఈయన ప్లీడరుగారు కాదు. ఈ ముసలోడికి నల్ల కోటు లేదు" అన్నాడు శివయ్య.

"నీ మొహం....ప్లీడరుగారయితే చచ్చిపోయేముందు నల్లకోటు వేసుకుని చచ్చిపోతాడా?" అని అడిగాడు చెన్నయ్య.

"నిజమేననుకో....అయినా ప్లీడరు గారికి యాభై యేళ్ళు లేవుకదా....ఈ ముసలోడికి అరవై యేళ్ళపైన వున్నట్టు న్నాయి....పైగా వీడు ముష్టివెధవలా వున్నాడు."

"ఒకేయే....ఏమాత్రం శమాలయ్యింది" అన్నాడు శివయ్య వాళ్ళని.

"ఎంతో కాలేదు బాబూ..ఇదిగో తమరి మామూలు" ఓ రెండు రూపాయల నోటును ఇవ్వబోయాడు.

"ఛీ.... వెధవా .... పోలీసులంటే ఏమనుకుంటున్నా వురా....మా సంగతి నీకు తెలీదు. మేమొక ముఖ్యమైన కేసు దర్యాప్తులో ఇటు వచ్చాం....వద్దులే....ఆ రెండు రూపాయలూ మీరే వుంచుకోండి" అని అక్కడినించి వెనక్కి తిరిగారు ఇద్దరూ—

వాళ్ళకి ఓ గంట తర్వాత పాడెమీద వూరేగుతూ వెళుతున్న ఓ శవం కనిపించింది.

చెన్నయ్య గబగబా అక్కడకు వెళ్ళి "ఈ శవం ఎవరిది?" అని అడిగాడు శవం వెనుకే వెళుతున్న మనుషుల్ని.

"ప్లీడరుగారిది" అన్నాడొకాయన.

"ఆ... ప్లీడరుగారిదా? యెక్కడిది మీకీ శవం?" అన్నాడు శివయ్య ఆదుర్దాగా.

"ఎక్కడిదేమిటండీ? ఈయన నాకు మేనమామ.... ఈ రోజు ఉదయమే ఉబ్బసం రోగంతో చచ్చి పోయాడు....మా చేతులమీదగానే పోయాడు."

"ఇంతకీ ఈయన పేరు విష్ణుమూర్తేనా?" అన్నాడు చెన్నయ్య.

"విష్ణుమూర్తి కాదండీ ...అన్నారావు....డెభ్భై ఏళ్ళ మనిషి."

"ఎందుకయినా మంచిది ...శవాన్ని దించి ముసుగు తీసి చూపించండి" అన్నాడు చెన్నయ్య.

"ఇదెక్కడి గొడవ? ముసుగుతీసి చూపించేదేమిటి?

ఈ శవం మా అన్నారావుగారిదంటే మీకు నమ్మకం లేదా? ఇంకొకరి శవాన్ని శ్మశానానికి మోసుకు వెళ్ళవలసిన అవసరం మాకేమిటి?" అన్నాడొకాయన కోపంగా.

"అయ్యా....మీరు మమ్మల్ని అపార్థం చేసుకోవద్దు. ఇప్పుడు మాయమైన ప్లీడరు విష్ణుమూర్తిగారి శవం దర్యాప్తులో వున్నాము. అందువల్ల ఇలా అడుగుతున్నాం" అన్నాడు శివయ్య.

"ఏమిటీ....శవం మాయమయ్యిందా?"

"అవును....నిజంగా మాయమయ్యింది" అంటూ వాళ్ళకి అంతా చెప్పేశారూ ఇద్దరూ—

"వింతగా వుంది....శవాలను ఏం చేసుకుంటారో.... సరే....శవాన్ని మధ్యలో దించటం బావుండదు.... స్మశానందాకా రండి....అక్కడే చూద్దురు" అన్నాడాయన.

సరేనని వాళ్ళతో స్మశానానికి వెళ్ళి అక్కడ ఆ శవం ముసుగుతీసి చూసి ఆ శవం ప్లీడరు విష్ణుమూర్తి గారిది కాదని రుజువు చేసుకున్నారు. మళ్ళీ దర్యాప్తుకు బయలుదేరారు.

గంట తర్వాత వాళ్ళకు థియేటర్ సెంటర్లో శవాన్ని పెట్టుకుని అడుక్కున్న యిద్దరు మనుషులు బాగా తాగి తూలుతూ పాటలు పాడుకుంటూ యెదురొచ్చారు.

"ఒరేయ్....ఆ శవాన్ని ఏం చేశారురా?" అడిగాడు చెన్నయ్య ఒకడిని.

"ఇంకెక్కడి శవం కాన్‌స్టేబులుగారూ.... దాన్ని ఆ మనుషులు పాతిక రూపాయలిచ్చి తీసుకుపోయారుగదా" అన్నాడొకడు.

"ఆ మనుషులు యెవర్రా?"

"ఎవరో తెలీదు బాబూ. ఇద్దరు మనుషులు వ్యానులో వచ్చారు. పాతిక రూపాయలు మా చేతిలో పెట్టి శవాన్ని వ్యానులో వేసుకొని వెళ్ళిపోయారు."

"ఎట్లా వున్నార్రా వాళ్ళు?" శివయ్య అడిగాడు.

"నల్లటి బట్టలు వేసుకున్నారు. లావుగా పొడుగ్గా వున్నారు....ఇద్దరికీ నెత్తిమీద టోపీలు వున్నాయి."

"ఆ వ్యాను నెంబరు చూశారా?"

"మాకు ఆ నెంబర్లతోటి పనేం బాబూ....రూపాయలు చేతిలో పడగానే మేము వెళ్ళిపోయాం."

"మళ్ళీ ఆ మనుషులను చూస్తే గుర్తుపట్టగలరా?" అడిగాడు శివయ్య.

"ఆ....ఎంతమందిలో వున్నా గుర్తుపట్టేస్తాం."

"అయితే — ఈసారి వాళ్ళు యెక్కడయినా కనపడితే స్టేషన్‌కి వచ్చి మాకు చెప్పండి."

"అట్టాగే బాబూ" అని వెళ్ళిపోయారు వాళ్ళు పాటలు పాడుకుంటూ—

"ఓయ్ చెన్నయ్యా....ఇప్పటికి మన పరిశోధన ఒక దార్లో పడింది. వీళ్ళు చెప్పిందాన్నిబట్టి ఈ ఊళ్ళో యెవరో మనుషులు శవాలను యెత్తుకెళుతున్నారు.... వీలయినచోట శవాలను కొంటున్నారు. వాళ్ళకు శవాలతో ఏదో పని వున్నది. కాబట్టి వెంటనే మనం తెలుసుకున్న ఈ విషయాన్ని మన ఇన్‌స్పెక్టర్ గారికి తెలియజెయ్యాలి" అన్నాడు శివయ్య.

"అవును....ఇది చాలా ముఖ్యమైన విషయం....ఇందువల్ల మనం చావబోయే వాళ్ళకి ముందుగా ఓ హెచ్చరిక కూడా చేయాలి....వాళ్ళ శవం మాయమవ

కుండా ముందు జాగ్రత్తలు తీసుకోమని."

ఆ రక్షకభటులిద్దరూ తమతమ సైకిళ్ళను గబగబా పోలీసుస్టేషన్ కేసి తొక్కటం మొదలుపెట్టారు.

4

గతుకుల రోడ్డుమీద నల్లరంగు ఎంబాసిడర్ కారు దుమ్ము లేపుకుంటూ వస్తోంది. రాత్రి కావటంవల్ల — చీకటిగా వుండటంతో దుమ్ము కనపడటంలేదు. ఆ కారు లైట్ల వెలుతురు దూరానికి పడుతోంది.

ఆ కారులో డ్రయివర్ కాకుండా మరో ముగ్గురు మనుషులు వున్నారు. ఆ ముగ్గురిలో బతికి వున్నవాళ్ళు ఇద్దరే. మరో మనిషి శవరూపంలో వున్నాడు.

ఆ శవం పేరు నిత్యానందం. ఆయన చుట్టం చూపుగా ఓ బంధువు ఇంటికి వెళ్ళి ఆ రోజు మధ్యాహ్నం అక్కడే గుండె ఆగిపోయి చనిపోయాడు. ప్రస్తుతం ఆయన శవాన్ని బంధువులు యిద్దరు ఆ కార్లో వేసుకుని ఆయన ఇంటికి చేర్చటానికి తీసుకువస్తున్నారు.

"ఇంకా ఎన్ని మైళ్ళు వెళ్లాలి?" అనడిగాడు ఒకాయన డ్రయివర్ని.

"దగ్గరలోకి వచ్చేశాం సార్. ఇంకో నాలుగు మైళ్లలో ఊరు వచ్చేస్తుంది. దారి బావుండకపోవటంతో మనకు యింత టైము తీసుకుంది. లేకపోతే ఈ సరికి వెళ్ళిపోయేవాళ్ళం" అన్నాడు డ్రయివరు.

"ఇదేం రోడ్డు.... ట్రాఫిక్ బాగా తక్కువగా వున్నది. కనీసం లారీలు కూడా ఎదురురావటంలేదు" అన్నాడు ఇంకో ఆయన మళ్ళీ.

"ఇప్పుడు ఈ రోడ్డును యెవ్వరూ ఉపయోగించటం లేదండీ. ట్రాఫిక్ తక్కువగా వుంటే త్వరగా చేరుకో

వచ్చునని ఈ రోడ్డున తీసుకువచ్చాను. కానీ రోడ్డు బాగా లేదు" అన్నాడు డ్రయివరు ముందుకు చూస్తూ—

ఒక నిమిషం తర్వాత "అదిగో ఏదో వెహికిల్ వస్తోంది .... లైట్లు కనపడుతున్నాయి" అన్నాడు డ్రయివర్.

"అవును. బహుశా లారీ అయివుంటుంది" అన్నాడు ఒకాయన. ఆయన పేరు బ్రహ్మారావు-ఆయన నిత్యానందం గారి మనిషి.

"కాదు....ఏదో చిన్న కారులాంటిది" అన్నాడు రెండో మనిషి సుందర్రావు.

ఐదు నిముషాలు గడిచే సరికి ఆ వాహనం కారు దగ్గరగా వచ్చేసి వెంటనే రోడ్డుకు అడ్డంగా ఆగిపో యింది.

ఆగిన వ్యానులోనించి లావుగా పొడుగ్గా వున్న ఇద్దరు మనుషులు గబగబా కిందికిదూకి ఎంబాసిడర్ కారు దగ్గరకు వచ్చారు.

"ఎవరు మీరు? ఎందుకు వ్యానును రోడ్డుకు అడ్డంగా ఆపారు?" అన్నాడు డ్రయివర్.

వాళ్ళిద్దరు గబుక్కున జేబుల్లోనించి నల్లగా నిగనిగ లాడుతున్న రివాల్వర్లను బయటకుతీసి "మర్యాదగా అందరూ కిందకు దిగండి. ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తే ప్రాణాలు పోతాయి" అన్నారు కర్కశంగా.

రివాల్వర్లకు భయపడి మాట్లాడకుండా ముగ్గురూ కిందికి దిగి చేతులెత్తారు.

ఆ ఇద్దరిలో ఒకడు లోపలకు తొంగిచూసి "జాన్... లోపల శవం వున్నది" అన్నాడు.

"గుడ్ .... దాన్ని మన వ్యాన్ లోకి చేరవెయ్యి"

అన్నాడు డాన్ ఉత్సాహంగా—జాన్‌తో—

ఆ మాట వినగానే బ్రహ్మారావు—సుందర్రావులతో పాటు డ్రయివర్ కూడా ఉలిక్కిపడ్డాడు.

శవం మాట వినగానే వ్యాన్ డ్రయివర్ కూడా కిందికి దిగి వచ్చాడు.

తర్వాత ఆ ఇద్దరూ డోర్ తెరిచి శవాన్ని బయటకు లాగారు.

బ్రహ్మారావు షాక్‌నించి తేరుకుని "ఆ శవాన్ని తీసుకెళ్ళకండి....అయినా శవాన్ని మీరేం చేసుకుంటారు? కావాలంటే డబ్బులు తీసుకోండి" అన్నాడు ఆదుర్దాగా.

"డాన్....ముందు వాడి నోరు మూయించు" అన్నాడు జాన్ శవాన్ని వ్యాన్ దగ్గరకు మోసుకెళుతూ—

డాన్ బ్రహ్మారావ్ దగ్గరకు వెళ్ళి రివాల్వర్‌ను అతని తలకు ఆనించి "నోర్మూసుకుని నిలబడు....శవాన్నే కాదు మీ దగ్గర వున్న డబ్బుని కూడా తీసుకెళతాం. సరే.... మీ దగ్గర వున్న డబ్బును తీసి ఇలా ఇవ్వండి.... మొండికేస్తే ప్రాణాలు పోతాయి" అన్నాడు.

బ్రహ్మారావు—సుందర్రావుకేసి చూశాడు.

ఇంతలో జాన్ కూడా అక్కడికి వచ్చి సుందర్రావు వీపుకు రివాల్వర్‌ని నొక్కిపట్టి "నీ జేబులో వున్న కరెన్సీ నోట్లను బయటకు తియ్యి" అన్నాడు.

డ్రయివర్ ముందుగా తన జేబులో వున్న వంద రూపాయల చిల్లరను బయటకు తీశాడు.

తర్వాత బ్రహ్మారావు — సుందర్రావు తమ పర్సుల్లో వున్న డబ్బును జాన్‌కి, డాన్‌కి ఇచ్చేశారు.

"వెరీ గుడ్....మీరు చక్కగా ప్రవర్తించారు. ఇక మా పని అయిపోయింది. అయితే మీరు వెంటనే మా

వెంట పడకుండా వుండటానికి ఇప్పుడు నేను ఒక పని చేస్తాను" అని డాన్ ఎంబాసిడర్ దగ్గరకు వెళ్ళి ఐదు నిముషాల తర్వాత అందులో కొన్ని తీగెలను తెంచి వచ్చేశాడు.

మరో రెండు నిముషాలకు జాన్-డాన్‌లు ఎక్కగానే వ్యాను స్టార్టయి వెనక్కు తిరిగి రివ్వున దూసుకుపోయింది.

"ఆశ్చర్యంగా వుంది.... వీళ్లెవరు? ఆ శవాన్ని తీసుకెళ్ళి ఏం చేసుకుంటారు?" అన్నాడు సుందర్రావు.

"వాళ్ళేం చేసుకుంటారో మనకు అనవసరం .. ఇప్పుడు మనం నిత్యానందం భార్యా పిల్లలకు ఏమని చెప్పాలి? శవాన్ని యెవరో మనుషులు యెత్తుకెళ్ళారంటే వాళ్ళు నమ్ముతారా?" అన్నాడు బాధగా—

డ్రయివర్ టార్చిలైటు తీసి కారును బాగుచెయ్యటం మొదలుపెట్టాడు.

అంతా చీకటి—

దూరంగా గతుకుల రోడ్డుమీద వ్యాను వెళుతున్న చప్పుడు వినపడుతోంది.

"ఇంతకీ నువ్వు ఆ వ్యాన్ నెంబర్ చూశావా?" అన్నాడు బ్రహ్మరావు.

"చూల్లేదు" అన్నాడు సుందర్రావు.

కారు రిపేరు జరుగుతోంది.

5

కానిస్టేబుళ్ళు పోలీసు స్టేషన్ ముందు సైకిళ్ళు దిగి లోపలకు వెళ్ళేసరికి యస్.ఐ. సూర్యం యెక్కడికో బయల్దేర బోతున్నాడు.

వీళ్ళిద్దరినీ చూసి "దర్యాప్తులో వున్నారా? లేక పోతే రోడ్లమీద తిరుగుతున్నారా?" అనడిగాడు.

"లేదు సార్.. దర్యాప్తులోనే వున్నాం. అంతే కాదు—మాయమైన శవం గురించి ఓ ముఖ్యమైన ఇన్ఫర్మేషన్ కనుక్కొన్నాం" అన్నారు ఇద్దరూ ముక్త కంఠంతో—

"నిజంగానా!"

"అవున్సార్ ...." అంటూ తమకు తెలిసిన విషయం గురించి సూర్యానికి చెప్పేశారు.

"అయితే ఈ శవాల దొంగలు ఆ ఇద్దరూ అన్న మాట."

"అవున్సార్ ....ఆ మనుషులు మళ్ళీ కనపడితే మన స్టేషన్‌కు వచ్చి రిపోర్టు చేస్తామని ఆ శవాన్ని అమ్మిన మనుషులు చెప్పారు. అంతేకాదు .... మేము కూడా ఆ దొంగ వెధవలకోసం ఉచ్చులు పన్నాలని అనుకుంటున్నాము" అన్నాడు చెన్నయ్య.

"రైట్ ....అయితే మిగిలిన స్టేషన్‌లకు కూడా ఈ ఇన్ఫర్మేషన్ పంపించాలి" అన్నాడు యస్.ఐ.

"అంతే కాదు సార్ ....చావబోతున్న వాళ్ళకు మనం ఒక హెచ్చరిక కూడా చేయాలి. చచ్చిన తర్వాత తమ శవాలను ఈ దొంగలు ఎత్తుకుపోకుండా తగు చర్యలు తీసుకుని మరీ చావాలి" అన్నాడు శివయ్య.

"సర్లే....ఇది సీరియస్ మేటర్. మనం జోక్‌గా మాట్లాడుకోగూడదు" అని కసిరాడు సూర్యం—శివయ్యను.

వాళ్ళు మాట్లాడుకుంటున్న తరుణంలో స్టేషన్ ముందు రివ్వున దూసుకువచ్చి ఆగిపోయింది నల్లని ఎంబాసిడర్ కారు.

అందులోనించి డ్రయివర్-బ్రహ్మారావు—సుందర్రావు

గబుక్కున కిందికి దూకి స్టేషన్‌లోకి పరుగుదీశాను.

లోపలకు వస్తూనే సుందర్రావు "నమస్కారం ఇన్‌స్పెక్టర్ గారూ....గొప్ప దారుణం జరిగిపోయింది" అని శోకం పెట్టేశాడు.

"ముందు కూర్చోండి. యెవరు మీరు? యేమిటా దారుణం....వివరంగా చెప్పండి. అలా కంగారుగా చెబితే నాకు ఏమీ అర్థంకాదు" అన్నాడు యస్.ఐ.

"సార్ నిత్యానందం అనే మా బంధువు హార్ట్ ఎటాక్‌లో చనిపోతే—ఆయన్ని కార్లో ఈ ఊరు తీసుకు వస్తున్నాము. ఇంతలో ఈ ఊరు రెండు మైళ్ళు వుందనగా ఎవరో యిద్దరు మనుషులు ఓ వ్యాన్‌లో వచ్చి కార్లో వున్న శవాన్ని, మా దగ్గర వున్న డబ్బుని లాక్కుని వ్యాన్‌లో వెళ్ళిపోయారు" అన్నాడు బ్రహ్మారావు.

"వాళ్ళేసార్ ఆ దొంగ వెధవలు .... అనుమానం లేదు" అన్నాడు శివయ్య.

"వాళ్ళు మీకు తెలుసా? వాళ్ళు మీకూ డా కనిపించారా?" అన్నాడు సుందర్రావు.

"వాళ్ళు మా కంట పడితే యెప్పుడో పట్టుకునే వాళ్ళం. ఇంతకుముందే మాకు ఇద్దరు దొంగల గురించి ఇన్ఫర్మేషన్ అందింది. వాళ్ళు ఇక్కడకూ డా ప్లీడరు విష్ణుమూర్తి శవాన్ని క్రితం రాత్రే ఎత్తుకుపోయారు. ఇక వాళ్ళు మా బారినుంచి తప్పించుకోలేరు" అన్నాడు చెన్నయ్య లాఠీ వూపుతూ.

"మీరు ఆ వ్యాన్ నెంబర్ చూశారా?" అడిగాడు యస్.ఐ.

"చూళ్ళేదు సార్....కాని ఆ ఇద్దరి పేర్లు మాత్రం

తెలిశాయి. ఒకడి పేరు జాన్ .... రెండోవాడి పేరు డాన్."

"భలే పేర్లు. వాళ్ళ ఇన్ఫర్మేషన్ తెలిసేట్టుగా ఇంకేదయినా మీ దగ్గర మాట్లాడుకున్నారా?" అన్నాడు సూర్యం.

"లేదు సార్ ....మాకంతా అయోమయంగా వున్నది. అసలు శవాలను తీసుకెళ్ళటం ఏమిటి? శవాలను ఏంచేసుకుంటారు? ఇప్పుడు నిత్యానందంగారి భార్యా పిల్లలకు మేము ఏమని చెప్పాలి? ఆయన శవాన్ని ఎవరో దొంగలు ఎత్తుకుపోయారంటే వాళ్ళు నమ్ముతారా?" అన్నాడు బ్రహ్మారావు దీనంగా—

"జరిగిన సంగతి చెప్పండి. ఒకవేళ వాళ్ళు నమ్మకపోతే మాకు కబురు చెయ్యండి. మేము వాళ్ళకు నచ్చచెబుతాము. మీరు వర్రీ అవకండి. త్వరలోనే ఆ జాన్నీ డాన్నీ పట్టుకుని శవాలు మాయం అవకుండా చూస్తాము" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఇంతకీ మరి మా నిత్యానందంగారి శవం...." అని ఆగిపోయాడు సుందర్రావు.

"ఇప్పుడు మా కానిస్టేబుళ్ళు ఆ దర్యాప్తులోనే వున్నారు. పనిలో పనిగా మీ నిత్యానందంగారి శవాన్ని కూడా వాళ్ళు వెతుకుతారు. ఒకవేళ మీకు ఆ జాన్—డాన్ ఎక్కడయినా కనపడితే మాకు తెలియజెయ్యండి. వెంటనే పట్టుకుంటాం."

"సరేనండీ.... వెళ్ళొస్తాం" అని బ్రహ్మారావు-సుందర్రావు ఇన్‌స్పెక్టర్‌కి నమస్కారంచేసి బయటకు వెళ్లారు.

వాళ్ళ వెనకే చెన్నయ్య—శివయ్య బయటకు వెళ్ళి "మామూలు ఇవ్వకుండానే వెళ్ళిపోతున్నారే"అన్నారు.

"మామూలా! మామూలు ఇవ్వటానికి మా దగ్గర ఏం మిగిలింది? అంతా ఆ జాన్—డాన్ వెధవలే వూడ్చుకు పోయారు" అన్నాడు సుందర్రావు.

"ఈ దొంగ వెధవలు మా కడుపులు కొడుతున్నారు. ఇందుకోసం వినా ఆ ఇద్దరినీ పట్టుకోవాలి" అన్నాడు చెన్నయ్య.

"అవును. మనం ఈ రాత్రికే ఆ జాన్—డాన్‌లను పట్టుకునే ప్లాను ఆలోచించాలి" శివయ్య అన్నాడు.

"తప్పకుండా భోజనం అయిన తర్వాత నువ్వు మా యింటికి వచ్చెయ్యి....కలిసి ఆలోచిద్దాం...." అన్నాడు చెన్నయ్య.

6

రాత్రి పన్నెండు గంటలు కావస్తోంది.

అంతటా నిశ్శబ్దంగా వుంది. ఒక్క ఆ భవనంలో తప్ప.

ఆ భవనం ఊరికి బయటగా వుంది. ఇక ఆ తర్వాత అన్నీ పొలాలు. పొదలు పిచ్చిగా పెరిగి వున్నాయి. ఆ భవనం పాడుబడిపోయి ఆ చీకట్లో రాక్షసిలా కనపడుతోంది. భవనం చుట్టూ ఎత్తుగా పెరిగిన చెట్లు ఆ భవనాన్ని దూరానికి కనపడనీయటంలేదు.

ఒక లారీ ఆ భవనం ముందు ఆగి వున్నది. అందులోకి కొంచెం సన్నగా — పొడుగ్గా వున్న చెక్క పెట్టెలను తీసుకువచ్చి లోడ్ చేస్తున్నారు నలుగురు మనుషులు.

చిన్న టార్చి లైటు—మరో చేతిలో రివాల్వర్ పట్టుకుని దగ్గరుండి ఆ పెట్టెలను లారీలో పెట్టిస్తున్నాడు జాన్.

డాన్ అతనికి కొంచెం దూరంగా నిలబడి సిగరెట్టు

కాల్చుకుంటున్నాడు.

"త్వరగా పని పూర్తిచెయ్యండి" అన్నాడు జాన్ టార్చి ఫోకస్‌ను అటూ ఇటూ కదిలిస్తూ—

పెట్టెలను మోసుకువస్తున్న మనుషులు ఆ చీకట్లో నీడల్లా బరువుగా కదులుతున్నారు.

"పన్నెండు గంటలయ్యేసరికి అంతా రెడీ అయిపోవాలి" అన్నాడు డాన్—జాన్ దగ్గరకు వచ్చి.

"ఇంకా పన్నెండు పెట్టెలు వున్నాయి. ఓ పది నిముషాల్లో అంతా పూర్తవుతుంది."

పదినిముషాలయ్యేసరికి లోడింగ్ పూర్తి అయింది. తర్వాత ఆ పెట్టెలపైన పూర్తిగా ఎండిపోయిన గడ్డి మోపుల్ని వేసి తాళ్ళతో కట్టేశారు.

ఇప్పుడు ఆ లారీని చూసిన యెవరైనా గడ్డి లారీ అనే అనుకుంటారు. అంతేగాని, ఆ గడ్డికింద చెక్క పెట్టెలు వున్నాయనీ—అక్కడినించీ ఓడలో అమెరికా వెళ్ళిపోతాయనీ, యెవ్వరూ వూహించలేరు.

లారీ బయల్దేరబోయేముందు డ్రయివర్‌తో "జాగ్రత్త. యేమాత్రం అజాగ్రత్తగా వున్నా బాస్ మన తోలు వొలిచేస్తాడు.... పోనివ్వు" అన్నాడు జాన్.

వెళ్ళిపోయింది లారీ బరువుగా కదిలి.

లారీ వెళ్ళిపోగానే జాన్-డాన్ లోపలకు వెళ్లారు. గదిలో ఫోన్ మ్రోగసాగింది.

జాన్ రిసీవర్ యెత్తి "హల్లో" అన్నాడు. అని వెంటనే అవతలివైపునించి బాస్ గొంతు వినిపించగానే "చెప్పండి బాస్" అన్నాడు.

"లారీ వెళ్ళిపోయిందా?"

"ఇప్పుడే వెళ్ళిపోయింది బాస్ .... అంటూ సవ్యంగానే

దగ్గరుండి లోడ్ చేయించాము నేను—డాన్."

"గుడ్ ... మీకు మరో ముఖ్యమైన విషయం. ఓగంట క్రితమే బాంబేనించి మెసేజ్ వచ్చింది. అమెరికానించి క్రొత్త ఆర్డర్ వచ్చిందట. వీలైనన్ని యెక్కువ అస్థిపంజరాలను పంపించమని మెసేజ్ ....అందువల్ల మీరు ఇంకా చురుగ్గా పనిచేయవలసి వుంటుంది. అందుకు తగిన ప్రతిఫలం మనకు ముడుతుంది. అవసరమైతే బతికివున్న అనామకులనైనా తెచ్చి అస్థిపంజరాలుగా మార్చండి?" అన్నాడు బాస్.

"ఓ.కె. బాస్ ....ఇంకా యెక్కువ కష్టపడి మీరు చెప్పినట్లే మన బిజినెస్‌ని వృద్ధిలోకి తీసుకువస్తాము" అన్నాడు జాన్.

"డాన్‌తో కూడా ఈ విషయం చెప్పు. ఇప్పుడు మీరు మన వేటకు బయల్దేరుతున్నట్టున్నారు .... అవునా?" అన్నాడు.

"అవును బాస్. ఇప్పుడే బయల్దేరుతున్నాం."

"రైట్ ....మళ్ళీ తర్వాత ఫోన్ చేస్తాను" అని బాస్ అవతలివైపునించి ఫోన్ పెట్టేశాడు.

జాన్ కూడా రిసీవర్ పెట్టేసి పక్కనే వున్న డాన్‌తో బాస్ చెప్పిన అమెరికా ఆర్డరు గురించి చెప్పాడు.

"అయితే మొత్తంమీద మనకు—మన బిజినెస్‌కీ మంచి భవిష్యత్తు వుందన్నమాట" అన్నాడు డాన్ మరో సిగరెట్ ముట్టించి.

"తప్పకుండా .... అయితే నాకో అనుమానం .... అమెరికా వెళ్ళిన మన అస్థిపంజరాలు అక్కడ యేం చేస్తాయి?"

"ఏంచేస్తే మనకెందుకు? ఆ అనుమానాలు మనకు రాకూడదు. వాళ్ళకు మన అస్థిపంజరాలు కావాలి. మనకు వాళ్ళ డబ్బు కావాలి.... అంతే!"

"ఇంతకీ నువ్వు ఆ చెట్టుకింద ప్లీడరు విష్ణుమూర్తిగారి కొడుకులకు వాళ్ళ నాన్న బూడిద పంపించావా?" అడిగాడు జాన్.

"పంపించలేదు. రేపయినా వాళ్ళకు ఆ భస్మం అంద జేయాలి ఘణ్యానదుల్లో కలుపుకోటానికి" అన్నాడు డాన్.

ఐదు నిముషాలు తర్వాత జాన్ — డాన్ శవాల వేటకు బయల్దేరారు.

7

ఉదయం పదిగంటలు దాటుతున్న సమయంలో ప్లీడరు విష్ణుమూర్తిగారి కొడుకులు ప్రకాశం—జనార్దనం సైకిళ్ళేసుకుని హడావిడిగా పోలీసుస్టేషన్‌కు వచ్చారు.

వస్తూనే బయటే కనిపించిన కానిస్టేబుళ్ళను చూసి "ఇన్‌స్పెక్టర్‌గారున్నారా?" అడిగాడు ప్రకాశం.

"ఎందుకు? మీ నాన్నగారి శవం గురించిన ఆచూకీ ఏదయినా తెలిసిందా?" అనడిగాడు చెన్నయ్య.

"మీరేం పోలీసులండీ .... మామూలు కూడా తీసుకున్నారు. వందకేసులు పూర్తయినాయని ఇద్దరూ కలిసి ఒక పుస్తకాన్ని కూడా అచ్చు వేయించుకున్నారు. ఇప్పుడు మా నాన్న శవం దొరికిందా అని మమ్మల్ని అడుగుతున్నారు" అన్నాడు జనార్దనం కొంచెం కోపంగా.

"జస్టు... ఇన్ఫర్మేషన్ కోసం అడిగాను. ఇదికూడా దర్యాప్తులో ఒక భాగమే. మా పరిశోధన ఇప్పుడిప్పుడే దార్లో పడుతోంది. ఇంతకీ మీరు యెందుకు వచ్చారు?"

అన్నాడు చెన్నయ్య మీసాలు దువ్వుకుంటూ.

"రండి చెబుతాము" అని ఇద్దరూ స్టేషన్‌లోకి నడిచి ఇన్‌స్పెక్టర్ గారికి నమస్కారం చేసి ఆయన ముందు ఓ చిన్న పొట్లాన్ని వుంచారు.

"ఏమిటదిి?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మా నాన్నగారి బూడిద" అన్నాడు ప్రకాశం....

"ఎక్కడిదీ!" ఆశ్చర్యంగా అడిగాడు సూర్యం.

"ఓ అరగంట క్రితం ఎవరో పదేళ్ళ కుర్రాడు మాకు ఈ పొట్లాన్ని తీసుకువచ్చి ఇచ్చాడు. ఎవడో లావుగా— పొడుగ్గా వున్న మనిషి ఈ పొట్లాన్ని మా ఇంట్లో ఇవ్వమని వాడికి ఓ రూపాయి ఇచ్చి వెళ్ళిపోయాడుట. తీరా విప్పిచూస్తే అందులో కొంచెం బూడిద ఒక కాయితం వున్నాయి. దానిమీద 'మీ నాన్న బూడిద' అని రాసి వుంది" అని చెప్పాడు ప్రకాశం యేడుపు మొహంతో.

సూర్యం ఆ పొట్లం విప్పాడు. అందులో బూడిద మధ్య చిన్న కాయితం దానిమీద వంకర టింకర అక్షరాలతో 'మీ నాన్న బూడిద' అని రాసి వుంది....

"ఇదేదో మిష్టరీలా వున్నది....మీ నాన్నగారి శవాన్ని వాళ్ళెవరో యెందుకు దహనం చేస్తారు? దహనం చేసినా బూడిదను మీకెందుకు పంపిస్తారు? ఏమిటో నాకంతా అయోమయంగా వున్నది. నా సర్వీసులో ఇలాంటి తల-తోక లేని కేసు ఇంతవరకు చూడలేదు" అని విసుక్కున్నాడు ఇన్‌స్పెక్టర్.

"సార్ ....ఈ మిష్టరీ ఏదో మేమిద్దరం ఈ రాత్రికే తేల్చెయ్యాలని అనుకుంటున్నాం. రేపు ఉదయానికి మీకు రిపోర్టు అందజేస్తాం" అన్నాడు చెన్నయ్య.

"రిపోర్టే అందజేస్తారో లేకపోతే బూడిద పొట్లాన్నే అందజేస్తారో.... నాకేమీ అర్థం కావటంలేదు. అందమైన ఆడపిల్లలనయినా ఎత్తుకుపోకుండా ఈ విధవలు శవాలను ఎత్తుకుపోవటం యెందుకు? సరే ఏం చేస్తాం? మీరు వెళ్ళి ఆ చితి భస్మాన్ని పవిత్ర జలాల్లో కలిపిరండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ప్రకాశంతో—

"అంతేలెండి.... అంతకంటే మేము చెయ్యగలిగింది ఏముంది? మా నాన్నగారి శవాన్ని మా చేతులమీదగా భస్మం చెయ్యలేక పోయాము" అని వాపోయాడు జనార్దనం.

తర్వాత అన్నదమ్ములు వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళగానే "ఇంతా నయం....వీళ్ళకు ఆ బూడిద అయినా పంపించారు. ఆ జాన్—డాన్‌లు ఇద్దరూ కొంచెం శాస్త్రం తెలిసిన మనుషుల్లాగే వున్నారు" అన్నాడు శివయ్య.

అతనలా అంటున్నప్పుడే పోలీసు స్టేషన్ ముందు రిక్షా ఆగింది.

అందులోనించి సుందర్రావు—బ్రహ్మారావు రిక్షా దిగి వాడికి డబ్బులు ఇవ్వకుండానే సరాసరి లోపలకు వచ్చేశారు.

బ్రహ్మారావు చేతిలో ఓ పొట్లం వున్నది.

దాన్ని చూడటంతోనే రక్షకభటులకీ, సూర్యంకీ కథంతా తెలిసిపోయింది.

"కూర్చోండి" అన్నాడు సూర్యం.

"సార్, ఈ పొట్లం...." అని ఏదో చెప్పటానికి ప్రయత్నం చేశాడు బ్రహ్మారావు.

అతని ప్రయత్నాన్ని వారించి "ఈ పొట్లంలో నిత్యా

నందంగారి బూడిద వున్నది. దీన్ని మీకు ఓ అరగంట క్రితమే యెవరో అందజేశారు. అంతే కదా" అన్నాడు సూర్యం.

"ఆహా....ఏం పరిశోధన? నిజంగా అద్భుతం....ఈ పాట్లంలో బూడిద వున్న సంగతి మీ కెలా తెలిసింది?" అని అడిగాడు సుందర్రావు.

"ఎలాగో తెలిసింది. మా విధానాలు మాకు వుంటాయి. మేము త్వరలోనే ఆ శవాల దొంగలను పట్టుకుంటాం. ఇక మీరు వెళ్ళి ఆ బూడిదను పుణ్య నదుల్లో కలిపిరండి" అని వాళ్ళని పంపించివేశాడు ఇన్ స్పెక్టర్ సూర్యం.

వెంటనే అతనికి ఓ ఫోన్ కాల్ వచ్చింది.

"యస్....సర్" అన్నాడు సీరియస్ గా.

అవతల మాట్లాడుతున్న మనిషి డి.ఐ.జి. అని అర్థం చేసుకున్నారు రక్షకభటులు.

"అవున్సార్. ప్రస్తుతం ఆ పరిశోధనలోనే వున్నాను. ఇంతకుముందే ఆ మనుషుల పేర్లు, కొన్ని గుర్తులు తెలిశాయి. వాళ్ళని ట్రేస్ చేసే ప్రయత్నంలో వున్నాను. త్వరలోనే వాళ్ళని పట్టుకుంటాను సార్."

రెండు నిముషాల తర్వాత ఫోన్ పెట్టేశాడు.

"విన్నారా....అప్పుడే ఈ శవాల గొడవ డి.ఐ.జి. దాకా వెళ్ళింది. నిత్యానందం కొడుకులు వెళ్ళి ఆయన్ని కలుసుకున్నారుట. వెంటనే ఈ కేసును తేల్చమంటున్నాడు" అన్నాడు సూర్యం.

"నిజమే సార్ .... త్వరలో ఈ దొంగలను పట్టుకోవాలి. అందుకు మేము ఈ రాత్రికే ఒక పథకం తయారు చేశాము" అన్నాడు చెన్నయ్య.

"ఏమిటా పథకం?" అన్నాడు సూర్యం.

తమ ప్లానును యస్.ఐ.కి వివరించి చెప్పారు ఇద్దరూ-

"ఈ ప్లానుకు దొంగలు దొరుకుతారా?" అనుమానంగా అడిగాడు సూర్యం.

"తప్పకుండా దొరుకుతారు సార్. వాళ్ళకు కావలసింది శవం. శవం యెక్కడ కనపడితే వాళ్ళు అక్కడికి వస్తారు! వాళ్ళు మా వలలో పడతారని మాకు పూర్తి నమ్మకం వుంది" అన్నాడు శివయ్య.

"గుడ్....జాగ్రత్తగా వుండండి. నేను కూడా ఈ రాత్రికి ఊళ్ళో తిరగాలని అనుకుంటున్నాను. అప్పుడప్పుడు మీరున్న సెంటరుకూడా వస్తుంటాను" అన్నాడు.

"ఈ రాత్రితో శవాల దొంగల పని ఖాళీ" అన్నాడు చెన్నయ్య.

8

వీధి దీపాలు మసగ్గా వెలుగుతున్నాయి.

రోడ్లమీద జనసంచారం తగ్గిపోయింది. చలిగా వుండటంవల్ల ఎనిమిది గంటలు దాటేసరికి జనం ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు.

ఒక సందు కార్నర్‌లో నిలబడి వున్నాడు చెన్నయ్య. అతనిముందు ఓ శవం వున్నది. దానినిండా ముసుగు వున్నది. ఆ శవం యెవరిదో కాదు — కానిస్టేబుల్ శివయ్యదే—

చెన్నయ్య మారువేషంలో వున్నాడు— చిరుగుల చొక్కా వేసుకున్నాడు. అతుకులుపడిన పంచె కట్టుకున్నాడు. చింపిరి తల.

శవం ముందు విశాలంగా గుడ్డపరిచి వున్నది. శివయ్య

కూడా మారువేషంలోనే వున్నాడు.

"దిక్కులేనోడు బాబూ ...మందుల్లేక చచ్చిపోయాడు బాబూ ...కనికరించండి.... ఓ పావలా ధర్మం చెయ్యండి" అని అరుస్తున్నాడు.

దయగలిగినవాళ్ళు ఆ గుడ్డమీద డబ్బులు విసిరి వెళ్ళిపోతున్నారు.

తను బాగా నటిస్తున్నందుకు తనని తనే మనసులో అభినందించుకున్నాడు చెన్నయ్య.

శివయ్య నటించవలసిన అవసరంలేదు. యెందుకంటే అతను స్పృహలో లేడు. యెన్ని గంటలు అలా పడి వుండవలసి వస్తుందో తెలీదు. అందుకే వూరికే కదల కుండా పట్టుకోటానికి విసుగు పుడుతుందని చెన్నయ్య— శివయ్యకు మత్తుమందు ఇచ్చాడు.

అందువల్ల శివయ్య ప్రస్తుతం నిద్రలో వున్నాడు.

తొమ్మిది గంట అయ్యింది.

జనసంచారం పూర్తిగా తగ్గిపోయింది. అప్పుడప్పుడు ఒకరు—ఇద్దరు నడుస్తున్నారు.

అప్పటికి రెండుసార్లు మోటారుసైకిలుమీద యస్.ఐ. సూర్యం అటువైపు వచ్చాడు.

చెన్నయ్య మారువేషాన్ని, అడుక్కోటాన్ని చూసి బాగానే నటిస్తున్నాడని నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

ఇన్‌స్పెక్టర్‌ని చూడగానే శాల్యూట్ చెయ్య బోయాడు చెన్నయ్య, కాని తన ప్లాను ఫెయిలవుతుందని ఆ పని చెయ్యలేదు.

పదిగంటలవుతున్నా చెన్నయ్య వూహించినట్టుగా జాన్—డాన్‌లు వ్యాన్ తీసుకుని అక్కడకు రాలేదు శవాన్ని తీసుకెళ్ళటానికి.

ఇక వాళ్ళు రారేమో అనుకున్నాడు చెన్నయ్య.

ఓ రిక్షాను పిలిచి శివయ్యను తీసుకుని వెళ్ళిపోదామని అనుకున్నాడు ఇంకో అరగంట చూసి—

పదినిమిషాలు గడిచాయి.

ఇంతలో ఓ సందు చివర ఒక మనిషి—కర్రపోటు వేసుకుంటూ చిన్నగా కుంటుతూ నడిచి వస్తూ కనిపించాడు. కొంచెం దగ్గరకు వచ్చిన తర్వాత వాడ్ని ముష్టివాడిగా గుర్తించాడు చెన్నయ్య.

వాడి చేతిలో చిన్న బొచ్చె వుంది. భుజానికి జోలె వేలాడుతోంది.

వాడు చెన్నయ్య దగ్గరకు వచ్చాడు.

ముందున్న శవాన్ని చూసి "ఎప్పుడు పోయాడు జీవుడు?" అనడిగాడు.

"మధ్యాహ్నం" చెప్పాడు చెన్నయ్య.

"ఏమిటో మడుసులు పుటిక్కున సచ్చిపోతున్నారు. ఎక్కడ సూసినా శవాలే."

"ఇంకా యెక్కడున్నాయి శవాలు?" అడిగాడు కానిస్టేబులు.

"అదిగో.... ఆ సందు చివర్లో చెత్తకుండీ పక్కన యెవడో సచ్చిపోయి వున్నాడు" అని కర్ర చప్పుడు చేసుకుంటూ ముందుకు కదిలాడు వాడు.

అక్కడో శవం వుందని తెలియగానే చెన్నయ్య పోలీసు బుద్ధి వూరుకోలేదు. ఆ శవం యెవరిదో వెళ్ళి చూడాలనిపించింది.

అందుకే ఒక్కసారి అటూ ఇటూ చూసి గబగబా ఆ సందులోకి నడిచాడు.

తీరా అక్కడకు వెళ్ళిన తర్వాత అతనికి కుండీ

పక్కన శవం కనిపించలేదు.

నిమిషంలోనే ఆ ముష్టివాడు ఫూల్ని చేసినట్టు గ్రహించాడు చెన్నయ్య .... గబగబా వెనక్కి తిరిగి వచ్చాడు.

షాక్ కొట్టినట్టు అనిపించింది.

అక్కడ శివయ్య లేడు....

పరిచిన గుడ్డ ఖాళీగా వుంది.

ఏం జరిగివుంటుందో గ్రహించిన చెన్నయ్య నిలువెల్లా వణికిపోయాడు.

ఇంతలోనే పక్కవీధిలో ఏదో వాహనం స్టార్టయిన చప్పుడు వినిపించింది.

రివ్వున ఆ వీధిలోకి పరుగుదీశాడు.

అప్పటికే ఏదో వాహనం కనుమరుగు అవుతూ కనిపించింది—ఎర్రటి లైటు వెలుగుతూ—ఆరిపోతూ.

"మోసం .... మోసం" అని అరిచాడు చెన్నయ్య పిచ్చిగా—

9

కళ్ళు తెరిచాడు శివయ్య—

ఎదురుగా జాన్—డాన్‌లు కనిపించారు. లావుగా—పొడుగ్గా వున్న వాళ్ళను చూడగానే వాళ్ళెవరో ఈజీగానే గ్రహించాడు కానిస్టేబులు శివయ్య—

అలా గ్రహించగానే ఉలిక్కిపడ్డాడు—చలిజ్వరం వచ్చిన వాడిలా వణికిపోయాడు.

"ఎందుకలా భయపడతావ్ రక్షకభట్టా....యిప్పుడు నీకే రక్షణ లేకుండా పోయిందనా?" అంటూ పెద్దగా నవ్వాడు జాన్.

శివయ్య మాట్లాడలేకపోయాడు. అసలు తను వీళ్ళకు

ఎలా దొరికాడో అర్థం కాలేదు. చెన్నయ్య ఏమైనాడు? వీళ్ళు చెన్నయ్యను కూడా తీసుకువచ్చారా?

అతడి అనుమానాన్ని గ్రహించినట్టు డాన్ సిగరెట్టు వెలిగించి "మీరిద్దరూ గొప్ప గూఢచారుల్లాగా మారు వేషాలు వేసుకొని మమ్మల్ని పట్టుకోవాలని అనుకున్నారు కదా! శవాన్ని మాకు ఎరగా చూపించి మమ్మల్ని బంధించాలని అనుకున్నారు. కాని మేము నీతోటి కానిస్టేబుల్‌కి మస్కాకొట్టి తెలివిగా నిన్ను ఇక్కడకు తీసుకువచ్చాము" అన్నాడు.

"ఇప్పుడు నన్నేం చేస్తారు?" అనడిగాడు శివయ్య—ఒంటరిగా ఆ దుండగులకు చిక్కినందుకు అతనికి యింతో భయంగా వున్నది.

ఇప్పుడు తను ఒంటరివాడు. పైగా నిస్సహాయ స్థితిలో వున్నాడు.

"నిన్నా.... ముందు నీతో ఆడుకుంటాము. ఆ తర్వాత మా బాస్‌కు ఫోన్ చేసి నిన్ను ఏంచెయ్యాలసిందీ తెలుసుకుంటాము" అన్నాడు డాన్.

"మీ బాస్ యెవరు?" అడిగాడు శివయ్య భయంగానే—కుతూహలాన్ని అణచుకోలేక.

"మా బాసా? చెప్పక తప్పదంటావా? అయినా నువ్వా మానించి తప్పించుకోలేవు కాబట్టి నీకు చెప్పినా ఫర్వాలేదు.... మా బాస్ యెవరో కాదు.... మా బాసు మీ బాస్" అన్నాడు జాన్.

"అంటే ఎవరు?" అన్నాడు శివయ్య.

"ఎవరో కాదు.... ఇన్‌స్పెక్టర్ సూర్యం."

"నిజంగానా! నేను నమ్మను .... ఆయన ఇలాంటి దుర్మార్గపు పనులు చెయ్యడు. ఆయన నిప్పులాంటి

మనిషి...." అన్నాడు శివయ్య ఆవేశంగా.

పెద్దగా నవ్వాడు డాన్.

"నువ్వింత అమాయకుడివని అనుకోలేదు. ఇలాంటి పనులు చేసేవాళ్ళంతా పైకి నిప్పుల్లాంటి మనుషుల్లాగే కనపడతారు. అలాంటప్పుడే ఇలాంటి పనులు చెయ్యటం సాధ్యమయ్యేది. నువ్వు నమ్మినా నమ్మకపోయినా యిది నిజం. లేకపోతే మీరు మారువేషాలు వేసుకుని మా కోసం వలపన్నారని మాకెలా తెలుస్తుంది? ఇప్పటి కయినా అర్థమయ్యిందా?" అన్నాడు నవ్వి.

శివయ్య ఆ మాటలు వినగానే అయోమయ స్థితిలో పడిపోయాడు.

ఇన్స్పెక్టర్ సూర్యం ఈ శవాల దొంగలకు నాయకుడా! ఇది నిజమా? యేమో! తను నమ్మలేకుండా వున్నాడు.

ఆయన గురించి తనకు బాగా తెలుసు.

వీళ్ళు అబద్ధం చెబుతున్నారు తనని ఫూల్ ని చెయ్యటానికి?—తను వీళ్ళ మాటలు నమ్మకూడదు.

"సరే.. ఆ విషయం గురించి తర్వాత ఆలోచిద్దువు గాని....ముందు ఈ ప్రయోగాల సంగతి చూడు" అన్నాడు జాన్.

డాన్ ఒక గదిలోకి వెళ్ళి చిన్న బాక్స్, ఒక స్పిరిట్ దీపం తీసుకువచ్చాడు.

ముందుగా ప్లాస్టర్ తో శివయ్య పెదవులకు అంటించారు అరవటానికి వీల్లేకుండా.

తర్వాత జాన్ స్పిరిట్ దీపం వెలిగించాడు. బాక్స్ లో నించి కొంచెం పొడుగ్గా—సన్నగా వున్న సూదులను బయటకు తీసి ముందుగా చిన్న పట్కాయతో ఒక సూది

స్పిరిట్ మీద కాల్చాడు.

అదంతా చూస్తుంటే శివయ్య ప్రాణాలు పైనే ఎగిరి పోయినట్టు అనిపించింది.

పోలీసు స్టేషన్లో కూడా తాము యెప్పుడూ యే నేరస్థుడి మీదా అలాంటి ప్రయోగాలు చెయ్యలేదు.

ఎర్రగా కాలిన సూదిని గబుక్కున శివయ్య చెంప మీద ఆనించాడు జాన్.

బాధగా మూలిగాడు శివయ్య. అతని కళ్ళలోనించి నీళ్ళు గిర్రున తిరిగి ధారగా కిందికి కారాయి.

"అప్పుడే అయిపోలేదు గురువుగారూ. మమ్మల్ని పట్టుకోవాలని మీ డ్యూటీ మీరు చేశారు. దొరికావు కాబట్టి మా డ్యూటీ మేము చెయ్యాలి కదా!" అన్నాడు డాన్.

అలా అని ఇంకో సూది తీసుకుని శివయ్య వేళ్ళమీద గోళ్ళకింద గట్టిగా లోపలికల్లా గుచ్చేశాడు.

మళ్ళీ ఎగిరి మూలిగాడు శివయ్య.

వేళ్ళలోనించి రక్తం జివ్వున పైకి వచ్చింది.

జాన్ అతని బాధను పట్టించుకోకుండా ఒక బ్లేడు తీసుకువచ్చి శివయ్య తలమీద గట్టిగా గీశాడు.

చర్మం గీరుకుపోయి తలమీదనించి మొహం మీదకు నెత్తురు కారిపోయింది.

ఈ బాధలకు ఓర్చుకోలేక శివయ్యకు స్పృహ పోయింది.

"కానిస్టేబుల్ స్పృహ తప్పాడు" అన్నాడు డాన్.

"అయితే ఇక మన ప్రయోగాలు ఆపు చేద్దాం. ఇన్నాళ్ళకు మనకు ప్రయోగాలు చెయ్యటానికి బతికివున్న ఓ మనిషి దొరికాడు. బావుంది. మళ్ళీ స్పృహ వచ్చే

వరకు ఎదురుచూద్దామా?" జాన్ అడిగాడు.

"వద్దు....మనం ఈ రక్షకభటుడ్ని తీసుకొచ్చినట్టు బాస్‌కు తెలియజెయ్యాలి" అని డాన్ పక్కనే వున్న గదిలోకి వెళ్ళి టెలిఫోన్ నెంబర్ తిప్పాడు.

క్షణం తర్వాత అవతలివైపు బాస్ గొంతు వినిపించింది.

బాస్‌కు జరిగినదంతా చెప్పి "బాస్ ఇప్పుడు ఆ పోలీసు మనిషిని ఏం చెయ్యమంటారు?" అనడిగాడు.

"మనగురించి తెలుసుకోటానికి ప్రయత్నించిన మనిషి-తెలుసుకున్న మనిషి ప్రాణాలతో వుండటానికి వీల్లేదు. వాడ్నికూడా అస్థిపంజరంగా మార్చెయ్యండి. మనకు ఉపయోగపడతాడు" అన్నాడు బాస్.

"ఓ.కే. బాస్" అని ఫోన్ పెట్టేసి బయటకు వచ్చాడు ఆ గదిలోనించి.

"వీడ్ని మనం యంత్రం వున్న గదిలోకి తీసుకెళ్ళాలి" అన్నాడు డాన్—జాన్‌తో.

ఇద్దరూ కలిసి శివయ్య కట్లు విప్పి అతడిని ఒక గదిలోకి మోసుకు వెళ్ళారు.

ఆ గదిలో పెద్ద ఇనుప స్టాండుమీద పొడుగాటి పెట్టెలాంటిది వుంది. దానిపైన ఒక తలుపు కూడా వుంది.

ముందుగా జాన్ ఆ పెట్టె తలుపును తెరిచాడు.

తర్వాత ఇద్దరూ పట్టి స్పృహలో లేని శివయ్యను ఆ పెట్టెలో పడుకోబెట్టారు. జాన్ మళ్ళీ తలుపు మూసి బోల్టు వేశాడు.

"రెడీయేనా?" అన్నాడు డాన్.

తల వూపాడు జాన్.

వెంటనే డాన్ గోడకు వున్న ఎలక్ట్రిక్ స్విచ్‌ను నొక్కాడు. నొక్కగానే ఎక్కడో బరబరమని చప్పుడు వినిపించింది.

ఒక నిమిషంలో ఆ గదిలో శవం కాలుతున్న వాసన వచ్చింది. జాన్-డాన్‌లు ఇద్దరూ జేబుల్లోనించి కర్చీఫ్‌లు బయటకుతీసి ముక్కుకు అడ్డుగా వుంచుకున్నారు.

డాన్ నిముష నిముషానికీ చేతినున్న గడియారాన్ని చూసుకున్నాడు.

సరిగ్గా పది నిముషాలు గడచిన తర్వాత మళ్ళీ స్విచ్ ఆఫ్ చేశాడు డాన్.

ఇంకో రెండు నిముషాలాగి ఆ పెట్టె తలుపు తెరిచాడు జాన్.

ఇప్పుడు అందులో శివయ్యకు బదులు అతని అస్థిపంజరం వున్నది. అందులో వున్న రంధ్రాలనించి బూడిద కిందికి వెళ్ళిపోయింది.

నవ్వాడు జాన్. "పాపం! దున్నపోతులా వుండే కానిస్టేబులు పదినిముషాల్లో ఎముకల గూడులా మారి పోయాడు. మనిషి జన్మ ఎంత చిత్రమయినది" అన్నాడు.

వాళ్ళిద్దరూ ఆ అస్థిపంజరాన్ని తీసుకెళ్ళి మరో గదిలో ఖాళీగా వున్న చెక్కపెట్టెలో పెట్టి దానికి మేకులు కొట్టేశారు.

అంతా అయిపోయిన తర్వాత జాన్ పని పూర్తయ్యిందని బాస్‌కు ఫోన్ చేసి చెప్పాడు.

10

ఇన్‌స్పెక్టర్ సూర్యం ముఖం గంభీరంగా వుంది. అతని ఎదురుగా చెన్నయ్య నిల్చుని వున్నాడు.

రాత్రి శివయ్యను ఆ దొంగలకు తెలివితక్కువగా అప్పగించినందుకు కానిస్టేబుల్ చెన్నయ్యను బాగా చీవాట్లు వేశాడు.

"ఇప్పుడు వాళ్ళు మన శివయ్యను ప్రాణాలతో వదులుతారంటావా?" అన్నాడు సూర్యం.

చెన్నయ్య ఏమీ మాట్లాడలేకపోయాడు.

వాళ్ళు శివయ్యను ప్రాణాలతో వదులుతారని అతనికి నమ్మకంలేదు.

"ఊహు.... నాకు నమ్మకంలేదు" అన్నాడు సూర్యం తనే.

ఐదు నిముషాలు గడిచిన తర్వాత యెవరో కుర్రాడు స్టేషన్ లోపలకు ఓ పొట్లాన్ని విసిరి పరుగుదీశాడు.

గబుక్కున ఆ పొట్లాన్ని చేతికి తీసుకున్నాడు చెన్నయ్య.

దాన్ని చూడగానే అతని చెయ్యి వణికింది.

అది ఏమయి వుంటుందో అతను వూహించగలిగాడు.

ఆ పొట్లాన్ని అతను సూర్యానికి ఇచ్చాడు.

దాన్ని విప్పి చూస్తే అందులో బూడిద—దానిమధ్య ఓ చిన్న కాయితం — దానిమీద 'ఇది కానిస్టేబుల్ బూడిద' అని రాసి వుంది.

దాన్ని చూడగానే సూర్యం మొహం కందగడ్డలా అయిపోయింది.

"డర్టీ డెవిల్స్....రోగ్స్ .... ఇడియట్స్ ..." పళ్ళు కొరికాడు.

చెన్నయ్యకు ఏడుపు ముంచుకువచ్చింది. ఆ తర్వాత విపరీతమైన కోపం—ఆవేశం ముంచుకువచ్చాయి.

'రాక్షసులు..తన ప్రాణస్నేహితుడు, సహ ఉద్యోగి

అయిన శివయ్యను పాటన పెట్టుకున్నారు. నిర్దాక్షిణ్యంగా బతికి వున్న మనిషిని బూడిద చేశారు. వీళ్ళని తను సుల భంగా వదిలిపెట్టకూడదు. ప్రాణానికి ప్రాణంతియ్యాలి.'

"చూడు. నీ ప్లాను వల్ల ఏం జరిగిందో. నీ ప్లానువ మన శివయ్య బలైపోయాడు" అని మరోసారి తిట్టాడు ఇన్ స్పెక్టర్.

ఆ రోజునే ఇన్ స్పెక్టర్ ఊళ్ళో శవాల దొంగల గురించి ప్రజలందరికీ హెచ్చరిక చేయించాడు.

శవాల దొంగలు వున్నారనీ — వాళ్ళు శవాలను ఎత్తుకుపోతున్నారనీ—అందువల్ల శవాలను జాగ్రత్తగా కాపలా కాసుకోవాలనీ హెచ్చరిక చేయించాడు.

ఆ రోజు పేపర్లో కూడా ఈ శవాల మాయం గురించి పెద్ద అక్షరాలతో ప్రచురించారు.

రాత్రి ఎనిమిది గంటలకు ఆ ఊళ్ళో వున్న పెద్ద కాంట్రాక్టరు కనకలింగం దగ్గర్నించి యస్.ఐ. సూర్యంకి ఫోన్ వచ్చింది.

"హల్లో .... మా ఇంట్లో ఓ ముసలాయన చనిపో యాడు" అని ఫోన్ చేశాడు.

"అయితే ఏమంటారు?" అన్నాడు సూర్యం.

"ఆ శవాన్ని దొంగలు ఎత్తుకుపోకుండా మీరు తెల్లవారినదాకా పోలీసు ప్రొటెక్షన్ ఇవ్వాలి" అన్నాడు కనకలింగం.

ఇన్ స్పెక్టర్ కి మతిపోయింది.

ఇప్పుడేమిటి చెయ్యటం? చివరికి తమ డిపార్టుమెంటు శవాలను ఎత్తుకుపోకుండా కాపలా కాయవలసిన స్థితికి వచ్చిందా?

"చెప్పరేమండీ. కానిస్టేబుల్స్ని పంపిస్తున్నారా?"

అనడిగాడు ఆయన.

"సారీ పోలీసు ప్రొటెక్షన్ యివ్వటం కుదరదు. మీ ప్రొటెక్షన్ మీరే ఏర్పాటు చేసుకోండి."

"ఏమిటి....మరి అలాంటప్పుడు పోలీసు హెచ్చరిక ఎందుకు చేయించారు?" తీవ్రంగా అడిగాడు కనకలింగం.

"మీ జాగ్రత్తలో మీరు వుండటానికి. యెన్ని శవాలకు మేము ప్రొటెక్షన్ ఏర్పాటు చెయ్యగలం? అందువల్ల సాధ్యంకాదు. సారీ" అని ఫోన్ పెట్టేశాడు సూర్యం.

ఉదయమే చెన్నయ్య పదిరోజులకు లీవుపెట్టి వెళ్ళి పోయాడు.

మిగిలిన కానిస్టేబుళ్ళు వున్నా వాళ్ళు అంత సమర్థులు కాదు. అందుకే సూర్యం ప్రొటెక్షన్ ఇవ్వటానికి ఒప్పు కోలేదు.

ఆ పైన పదినిమిషాలకు డి.ఐ.జి. మళ్ళీ ఫోన్ చేశాడు. శవాల మాయం గురించిన వ్యవహారం యెంతవరకు వచ్చిందని అడిగాడు.

ఇంకా దర్యాప్తులో నే వుందనీ త్వరలో నే ఆ శవాల దొంగలను పట్టుకుంటానని చెప్పాడు సూర్యం.

11

అక్కడి వీధి దీపం వెలగటం లేదు. బాగా చీకటిగా వున్నది. రాత్రి పదకొండు గంటలు కావస్తోంది.

గంట సేపటినించీ ఆ చీకట్లో మోటారుసైకిలును ఆపి దాని పక్కనే నిలబడి వున్నాడు ఇన్స్పెక్టర్ సూర్యం.

అక్కడ నిల్చుంటే కొంచెం దూరంలో కంట్రాక్టర్ కనకలింగం యిల్లు క్లియర్ గా కనపడుతోంది.

వరండాలో ఒక శవం వున్నది. ఆ శవానికి కొంచెం

దగ్గరగా కూర్చుని కొంతమంది దుఃఖిస్తున్నారు.

కొంతమంది నిద్ర ముంచుకువస్తున్నట్టుగా వున్నారు.

ఎవరయినా తెల్లవార్లూ కాపలాకాయటం కష్టం. నిద్రవచ్చే సమయం. అందువల్లనే రాత్రివేళల్లో దొంగలు శవాలను సులభంగా ఎత్తుకుపోతున్నారు.

సూర్యంకి అసహనంగా వున్నది. అసలు ఆ దొంగలకు ఇక్కడ ఓ శవం వున్నట్టు తెలుసా?

తప్పకుండా తెలుస్తుంది. వాళ్ళు ఎలాగైనా తెలుసుకుంటారు.

కాబట్టి శవంకోసం తప్పకుండా వాళ్ళు అక్కడకు వచ్చితీరాలి.

ఎన్ని గంటలయినా ఆ మనుషులకోసం తను వేచి వుండాలి. ఈ రాత్రికి యెలాగైనా వాళ్ళ అంతు తేల్చుకోవాలి.

జాన్ — డాన్ ఇద్దరు మనుషులే ఈ దొంగతనాలను చేస్తున్నారా? వీళ్ళ వెనుక ఇంకో మనిషి యెవరయినా వున్నాడా?

ఆలోచిస్తున్నాడు సూర్యం.

ఆలోచిస్తున్న సూర్యం ఉలిక్కిపడ్డాడు.

తన పక్కన ఏదో నీడ కదిలినట్టు అనిపించింది.

పక్కకు తిరగబోయాడు. కాని అప్పటికే ఆలస్యం అయ్యింది. వెన్నులో రివాల్వర్ మొన గుచ్చుకున్నది.

అతని దృష్టి అంతా కంట్రాక్టర్ కనకలింగం ఇంటి మీద వుండటంవల్ల వెనకనించి వస్తున్న మనిషిని తను గ్రహించలేకపోయాడు.

గ్రహించేసరికి ఆలస్యం జరిగిపోయింది.

"కదలకు ఇన్‌స్పెక్టర్. నీ సంగతి మాకు బాగా

తెలుసు. నువ్వు ఇలాంటి ప్రయత్నం ఏదో చేస్తావని నేను అనుమానిస్తూనే వున్నాను. అనుమానించినట్టుగానే నువ్వు ఇక్కడ దొరికిపోయావు" అన్నాడు అతని వెనుక నిల్చున్న జాన్.

తనుకూడా యింత సులభంగా వాళ్ళకు చిక్కిపోయి నందుకు సూర్యంకు అవమాన మనిపించింది.

"పిచ్చి వేషాలు వెయ్యకు. తప్పించుకు నే ప్రయత్నం చెయ్యకు. నా చేతిలో వున్న రివాల్వర్ పేలుతుంది. క్షణంలో నీ ప్రాణం ఎగిరిపోతుంది. మర్యాగా వెనక్కు తిరిగి ఆ సందు చివరకి నడు. అక్కడ మా వ్యానువుంది" అన్నాడు జాన్.

ఇన్‌స్పెక్టర్ సూర్యానికి వెనక్కు తిరక్క తప్పలేదు. రెండడుగులు వేశాడు. అయినా అతని మనసు తప్పించుకుని అవతలి మనిషిని దెబ్బతీయటం గురించే ఆలోచిస్తోంది.

ఎలా?

కనకలింగం ఇంట్లోనించి ఏడుపులు వినపడుతున్నాయి.

"ఇప్పుడు నన్నెక్కడికి తీసుకువెళతారు?" అడిగాడు సూర్యం.

"తొందరెందుకు? నీకే తెలుస్తుందిగా" అన్నాడు జాన్ ట్రిగ్గర్ మీద వేలును బిగిస్తూ—

సూర్యాం నడుస్తున్నవాడల్లా ముందుకు పడిపోయాడు వున్నట్టుండి.

అంతే. జాన్ రివాల్వర్ పేల్చాడు. బుల్లెట్ సూర్యానికి తగల్లేదు. ఎదురుగా వున్న గోడకు తగిలింది.

కిందపడిన ఇన్‌స్పెక్టర్ కాళ్ళతో జాన్‌ను ఈడ్చే తన్నాడు. జాన్ బోర్లా పడబోయి ఎలాగో నిగ్రహించు

కున్నాడు.

మరోసారి రివాల్వర్ పేల్చబోయాడు. కాని అప్పటికే రివాల్వర్ మోత విని అక్కడ వున్న ఇళ్ళలో వున్న జనం తలుపులు తెరుచుకుని బయటకు వస్తున్నారు.

అందుకే పైకి లేవబోతున్న ఇన్‌స్పెక్టర్ తలమీద రివాల్వర్‌తో కొట్టి అక్కడినించి రివ్వున పరిగెత్తి వెళ్ళి వ్యానులో ఎక్కాడు జాన్.

అంతే. వ్యాన్ వేగంగా దూసుకుపోయింది.

"ఏమయ్యింది?" అడిగాడు డాన్.

జరిగినదంతా చెప్పాడు జాన్.

"పొరపాటు చేశావు జాన్. ఇన్‌స్పెక్టర్‌తో మనకు పనిలేదు. మనకు ఆ కనకలింగం ఇంట్లో వున్న శవం కావాలి. వెనకనించి వెళ్ళి ఇన్‌స్పెక్టర్ తలమీద కొట్టి స్పృహ తప్పించినట్లయితే మన పని అయిపోయి వుండేది" అన్నాడు డాన్.

"నా ఉద్దేశం అది కాదు డాన్. ఇన్‌స్పెక్టర్ని బంధించి తీసుకెళ్ళి బాస్‌కు అప్పగించాలనుకున్నాను. అందుకే రిస్కు తీసుకున్నాను. కాని కుదరలేదు" అన్నాడు.

12

పదినిమిషాలు దాటేసరికి వ్యాను ఆ ఊరి బయట వున్న భవనం దగ్గరకు చేరుకుంది.

అందులోనించి జాన్—డాన్ దిగి లోపలకు వెళ్ళారు.

అప్పటికే లోపల బాస్ కూర్చుని వున్నాడు.

ఖాళీ చేతులతో వచ్చిన జాన్—డాన్‌లను చూసి "శవాన్ని తీసుకువచ్చారా?" అడిగాడు.

"లేదు బాస్" అని జరిగినదంతా చెప్పేశాడు జాన్.

"ఇడియట్. ఆ ఇన్‌స్పెక్టర్‌తో మనకు పనేమిటి? వాడ్ని వెనకవించి దెబ్బకొట్టి శవాన్ని తీసుకురాకుండా అతి తెలివికిపోయి అసమర్థుడిలా తిరిగివచ్చావు. నీలాంటి అసమర్థుడు నాకు పనికిరాడు" అంటూ చటుక్కున రివాల్వర్ బయటకుతీసి జాన్ గుండెలకేసి కాల్చాడు బాస్.

షాక్ కొట్టినట్టు అయిపోయాడు డాన్.

"బాస్!" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును డాన్....ఏ పని ముఖ్యమో దాన్ని ముందు చేసే మనుషులు నాకు కావాలి. నీకు మరో మనిషిని తోడుగా ఇస్తాను. ఇప్పుడు మన అస్థిపంజరాల బిజినెస్‌కు ఒక్క అమెరికానించే కాకుండా మరికొన్ని దేశాలనించి కూడా ఆర్డరు వస్తున్నాయి. మన బిజినెస్‌లో నిన్ను పార్ట్‌నర్‌గా చేర్చుకోవాలని అనుకుంటున్నాను. ముందు నువ్వు ఈ జాన్‌ని స్కెలిటన్‌గా మార్చేసెయ్యి" అన్నాడు బాస్.

నిర్జీవంగా నెత్తురుమడుగులో పడివున్న జాన్ శవాన్ని ఎత్తి భుజాన వేసుకుని తీసుకువెళ్ళి స్టాండుమీద వున్న పెట్టెలో వుంచి తలుపు మూసి స్విచ్ నొక్కాడు.

పదినిముషాల తర్వాత జాన్ అస్థిపంజరంగా మారిపోయాడు. అతని అస్థిపంజరాన్ని బాస్ ఆజ్ఞప్రకారం చెక్క పెట్టెలో పెట్టి మేకులు కొడుతుంటే డాన్‌కి కన్నీళ్ళు వచ్చాయి.

"వెరీగుడ్. జాన్ చచ్చికూడా మనకు ఉపయోగపడుతున్నాడు. రైట్ డాన్....ఇక నేను వెళతాను. గుడ్‌నైట్" అని వెనక్కి తిరిగాడు బాస్.

అంతే వేగంగా తన ప్యాంటుజేబులోనించి రివాల్వర్

బయటకుతీసి వెనుకనించి బాస్‌ను షూట్ చేశాడు డాన్.

పెద్దకేకతో బోర్లా పడిపోయాడు బాస్.

"డర్టీ రోగ్. నా ప్రాణమిత్రుడు జాన్‌ని ఈజీగా షూట్ చేసి చంపుతావా? దెబ్బకి దెబ్బతీశాను బాస్" అని బాస్ శవాన్ని భుజాన వేసుకుని తీసుకెళ్ళి పెట్టెలో వుంచి తలుపు మూసి స్విచ్ నొక్కాడు.

బరబరమని చప్పుడు వినిపించింది.

పదినిమిషాల తర్వాత స్విచ్ ఆఫ్ చేసి తలుపు తెరిచి లోపలకు తొంగి చూశాడు.

ఎన్నో శవాలను అస్థిపంజరాలుగా మార్చివేయించిన బాస్ ఇప్పుడు అస్థిపంజరంగా మారిపోయాడు.

"బాస్ నీ అస్థిపంజరం మాత్రం అమెరికా వెళ్ళదు. నీ దురదృష్టం. ఇక ఈ అస్థిపంజరాల బిజినెస్‌కి గుడ్ బై కొడుతున్నాను" అని తలుపు మూసి టెలిఫోన్ దగ్గరకు నడిచి డయల్ చేశాడు.

"హల్లో ఎవరు మాట్లాడేది? ఇన్‌స్పెక్టర్ సూర్యమేనా? అయితే నేను చెప్పేది జాగ్రత్తగా విను. శవాల దొంగతనాలు ఈ రోజుతో అంతం అయిపోయాయి. శవాలను అస్థిపంజరాలుగా ఓ యంత్రంద్వారా మార్చి వాటిని బొంబేకు పంపిస్తున్నాడు బ్రహ్మరావు. ఆయనే నిత్యానందం బంధువు. ఆయనే అసలు బాస్. బొంబే నించి ఆ అస్థిపంజరాలు అమెరికాకు వెళతాయి.

ఇక్కడ ఇంతకుముందే బాస్ జాన్‌ని రివాల్వర్‌తో షూట్ చేసి చంపి అస్థిపంజరంగా మార్పించాడు. తర్వాత నేను బాస్‌ని షూట్ చేసి అస్థిపంజరంగా మార్చివేశాను. ఇప్పుడాయన శవం ఆ పెట్టెలోనే వుంది. ఈ ముఠాలో యెవరెవరు ఎక్కడెక్కడ పనిచేస్తున్నదీ తెలియచేసే

ఆధారాలు ఊరి బయట వున్న పాడుపడిన భవనంలో మీకు దొరుకుతాయి. ఇక నేను మంచిగా బతకాలనుకుని ఇక్కడినించి వెళ్ళిపోతున్నాను" అని ఫోన్ పెట్టేశాడు.

వెంటనే అతనికి "నన్ను తప్పుకుని నువ్వు ఎక్కడికీ వెళ్ళలేవురా డాన్" అనే మాటలు వినిపించాయి.

ఉలిక్కిపడి చూశాడు డాన్.

గుమ్మం దగ్గర కానిస్టేబుల్ చెన్నయ్య నిలబడి వున్నాడు. అతని చేతిలో రివాల్వర్ వుంది.

"నువ్వా!" అన్నాడు డాన్ ఆశ్చర్యంగా జేబులోనించి రివాల్వర్ తీసే ప్రయత్నం చేస్తూ—

"అవును. నేనే నువ్వు చెయ్యి కదల్చావు చచ్చిపోతావ్. మీకోసమే అంతా గాలిస్తున్నాను. చివరికి ఇక్కడ రివాల్వర్ పేలిన చప్పుడు వినిపించింది. బయట ఆగివున్న మీ వ్యాన్ కనిపించింది. వచ్చేశాను. ఇంతకీ మా కానిస్టేబుల్ శివయ్యను ఎలా బూడిదగా మార్చేశారో చూపిస్తావా? నిన్ను వదిలిపెడతాను" అన్నాడు చెన్నయ్య.

"నిజంగా వదిలిపెడతావా?"

"తప్పకుండా. నేను ఆడినమాట తప్పను. నువ్వు ఫోన్‌లో మాట్లాడినదంతా విన్నాను. ఇకనించీ నువ్వు మంచివోడుగా బతుకు" అన్నాడు.

సరేనని డాన్—చెన్నయ్యను ఆ యంత్రం వున్న గదిలోకి తీసుకెళ్ళి అందులోనించి బాస్ శవాన్ని తీసి అది మనుషులను అస్థిపంజరాలుగా ఎలా మార్చేదీ చెప్పేశాడు.

అంతే. డాన్ పూర్తి చెయ్యగానే చెన్నయ్య చేతిలో వున్న రివాల్వర్ పేలింది. రెండు గుండ్లు డాన్ గుండెలను

చీల్చుకుని పోయాయి. కింద పడిపోయాడు డాన్.

వెంటనే అతన్ని ఆ పెట్టెలో వుంచి తలుపుమూసి స్విచ్ ఆన్ చేశాడు చెన్నయ్య.

పదినిముషాలు గడిచాయి.

తలుపు తెరిచి లోపలకు చూశాడు. డాన్ అస్థి పంజరం కనిపించింది.

కసిగా నవ్వాడు కానిస్టేబుల్ చెన్నయ్య.

"శివయ్యా! నిన్ను మసిచేసిన మనిషిని నేను మసి చేశాను. నా పగ తీర్చుకున్నాను. ఇప్పుడు నా మనసుకు ఎంతో తృప్తిగా వుంది" అన్నాడు.

వెంటనే అతనికి శివయ్య గుర్తుకు రాగానే కళ్ళ వెంట నీళ్ళు వచ్చాయి.

క్షణం తర్వాత చెన్నయ్యకు దగ్గరగా ఏదో వాహనం వస్తున్న చప్పుడు వినిపించింది. ఆ వచ్చేది పోలీసు జీపు అని గ్రహించిన కానిస్టేబుల్ చెన్నయ్య బయటకు వచ్చి వెనుకవైపున వున్న గోడమీాకి చీకట్లో కలిసిపోయాడు.

సరిగ్గా అప్పుడే చీకట్లో దెయ్యంలా వున్న ఆ అస్థి పంజరాల భవనం ముందు పోలీసు జీపు వచ్చి ఆగి పోయింది.

—: అయిపోయింది :—